కొత్త పింఛన్.. ఆనందం పెంచెన్

- అట్టహాసంగా ముగిసిన వైఎస్సార్ పింఛన్ కానుక వారోత్సవాలు
- పింఛను మొత్తం పెంపు, కొత్త పింఛన్లతో ముందే వచ్చిన సంక్రాంతి
- నియోజకవర్గంలో 38,317 మంది పింఛను లబ్ధిదారులు
- కొత్తగా 1,123 మందికి పింఛన్లు మంజూరు



పింఛన్ల వారోత్సవాలకు హాజరైన లబ్ధిదారులు



ఆళ్లగడ్డలో కొత్త పింఛను లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి

ఆళ్లగడ్డ: కులం, మతం రాజకీయాలతో పనిలేదు. నాయకులు. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన అవసరం లేదు. గత ప్రభుత్వంలో వలే జన్మభూమి కమిటీ సభ్యుల కాళ్లు పట్టుకోవాల్సిన బాధ అంతకంటే లేదు. అర్హతే కొలమానంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను మంజూరు చేస్తోంది. వలంటీర్లతో ఇంటింటా అర్హులను గుర్తిస్తోంది. అర్హులైన లబ్ధిదారులకు పింఛన్‌తో ఆర్థిక భరోసా కల్పిస్తోంది. తాజాగా ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 1,123 మంది లబ్ధిదారులకు కొత్తగా పించన్లు మంజూరు చేసి వారిలో సంతోషం నింపింది.పింఛన్‌దారులకు ముందుగానే సంక్రాంతి పండుగొచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పింఛనుదారులకు ఇస్తున్న నగదు రూ.2,750కు పెంచడంతో పాటు కొత్తగా అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేసింది. ఈ నెల 1వ తేదీ నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభం కాగా వారం రోజుల పాటు ప్రభుత్వం చేపట్టిన పింఛను కానుక వారోత్సవాలు అట్టహాసంగా ముగిశాయి. కొత్త పింఛన్లు అందుకున్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల్లో ఆనందం తాండవిస్తోంది. పెద్ద పండుగ ముందే వచ్చినంత సంబరంగా ఉందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

1,123 మందికి కొత్త పింఛన్లు

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 37,194 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. ఈ నెల 1,123 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేయడంతో వారి సంఖ్య 38,317కు చేరుకుంది. పింఛనుదారులకు జనవరి నుంచి చెల్లించే మొత్తం రూ.11,11,19,300కు పెరిగింది.

అర్హతే ప్రామాణికం

పారదర్శకతకు పెద్దపీట వేస్తూ నియోజకర్గంలో కొత్త పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. సెప్టెంబర్ నుంచి వచ్చిన దరఖాస్తులను గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులు ఆయా గ్రామ వలంటీర్ల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి 1,123 మందిని అర్హులుగా గుర్తించారు. వారందరికీ కొత్త పింఛన్లు మంజూరు చేశారు. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లవద్దకే వెళ్లి పింఛన్లు అందించారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్ పింఛన్ కానుక వివరాలు

మండలం	కొత్త పింఛన్లు	పాత పింఛన్లు	మొత్తం పింఛన్లు
ఆళ్లగడ్డ	113	4,984	5,097
ఆళ్లగడ్డ రూరల్	164	4,918	5,082
చాగలమర్రి	219	6,053	6,272
దొర్నిపాడు	110	3,568	3,678
రుద్రవరం	178	6,095	6,273
శిరివెళ్ల	250	7,823	8,073
ఉయ్యాలవాడ	89	3,753	3,842
మొత్తం	1,123	37.194	38,317


జీవితాంతం రుణపడి ఉంటాం



మేము కూలి పనులు చేసుకుని జీవిస్తున్నం. నా కొడుకు జాషువాకు చిన్నప్పటి నుంచి వెన్నుముక సమస్యతో నడవలేడు, కూర్చోలేడు. సదరం క్యాంపులో సర్టిఫికెట్ కోసం వెళితే ఇవ్వడం కుదరదని చెప్పేవారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మా ఇంటి వద్దకు వచ్చిన ఎమ్మెల్యే నానికి విషయం చెప్పడంతో అక్కడిక్కడే అధికారులతో మాట్లాడి నెల లోపు పింఛన్ ఇప్పించాలని ఆదేశించారు. అధికారులు చర్యలు తీసుకొని నా కొడుకుకు సర్టిఫికెట్ తెప్పించి ప్రస్తుతం రూ.3 వేల పింఛన్ మంజూరు చేశారు. ఇది మా కుటుంబానికి ఎంతో ఉపయోగపడుతుంది. సీఎం జగనన్నకు, ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం.

– నేరేళ్ల జాషువ, తల్లి రాణి, జి.జమ్ములదిన్నె గ్రామం

సంతోషంగా ఉంది



నాది ఏ ఊరో నాకే తెలియదు. కొన్ని సంవత్సరాలుగా పేరాయిపల్లెలో ఉంటూ ఎవరైనా పెడితే తింటూ కాలం గడిపేవాడిని. నాకు ఆధార్, రేషన్ కార్డులు ఏమీ లేవు. గ్రామ సర్పంచ్ మరికొందరు వైఎస్సార్ సీపీ నాయకులు కలిసి సచివాలయ సిబ్బందితో మాట్లాడి నాకు ఆధార్ కార్డు, రేషన్ కార్డులు మంజూరు చేయించి వృద్ధాప్య పింఛన్ ఇప్పించారు. ఈ పింఛనుతో యాచన చేయకుండా గౌరవంగా జీవనం సాగిస్తా..

– నాగభూషణం, పేరాయిపల్లె

పార్టీ చూడకుండా పింఛను ఇచ్చారు



నాకు రెండేళ్ల క్రితం గుండెకు ఆపరేషన్ అయింది. తర్వాత కొన్ని రోజులకు కంటి చూపు పోయింది. పింఛనుకు దరఖాస్తు చేసుకోమని అందరూ చెబుతుంటే నేను టీడీపీకి ఓటు వేశాను కదా నాకు ఎవరు ఇస్తారు అని చెప్పేవాడిని. విషయం తెలుసుకుని వలంటీర్ వచ్చి దగ్గరుండి సదరం క్యాంపుకు తీసుకెళ్లి సర్టిఫికెట్ ఇప్పించి, ప్రస్తుతం వికలాంగుల పింఛన్ రూ.3 వేల మంజూరు చేయించారు. ఇది నా కుంటుంబానికి ఎంతో ఉపయోగపడుతుంది.

– నల్లపక్కల నారాయణ, మిట్టపల్లె

క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ

నంద్యాల(వ్యవసాయం): రియాసతి ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జమాన్ మాట్లాడుతూ ఉర్దూ టీచర్లకు విద్యార్థులకు కావాల్సిన సమాచారం క్యాలెండర్‌లో పొందుపరిచామని, ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పట్టణ శాఖ కార్యవర్గ సభ్యులు షఫీవుల్లా, మహబూబ్‌బాషా, దస్తగిరిబాషా, కలీముల్లా, జానీ, బాషా, అనీఫ్, జిక్రియ అలీఖాన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించండి

గోస్పాడు: విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని ఏఈ జ్ఞానసూర్యుడు కోరారు. స్థానిక సబ్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అవసరం మేరకే విద్యుత్ వినియోగించుకోవాలన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. అక్రమ కనెక్షన్లు, విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయా గ్రామాల విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు

భజరంగ్‌దళ్ రాష్ట్ర కో-కన్వీనర్‌గా సందీప్



పోలేపల్లి సందీప్

నంద్యాల(వ్యవసాయం): భజరంగ్‌దళ్ రాష్ట్ర కో-కన్వీనర్‌గా పట్టణానికి చెందిన పోలేపల్లి సందీప్ ఎంపికైనట్లు నంద్యాల జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 6, 7 తేదీల్లో ఆదోనిలో జరిగిన విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సమావేశాల్లో సందీప్‌ను రాష్ట్ర కో-కన్వీనర్‌గా ఎన్నుకున్నట్లు తెలిపారు. పోలేపల్లి సందీప్ మాట్లాడుతూ.. దేశ ధర్మ రక్షణ కోసం యువత భజరంగ్‌దళ్‌లో చేరాలని పిలుపునిస్తూ, గ్రామ గ్రామానికి భజరంగదళ్ విస్తరణే లక్ష్యంగా కృషి చేస్తానన్నారు. తన నియామకంపై రాష్ట్ర, జిల్లా నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

13న కబడ్డీ పోటీలు

నంద్యాల(అర్బన్): సంక్రాంతి పండుగ పురస్కరించుకొని డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 13న పట్టణంలోని పద్మావతినగర్ ఇండోర్ స్టేడియంలో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి శివ తెలిపారు. కబడ్డీ పోటీలకు సంబంధించిన పోస్టర్లను వారు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులతో కలిసి మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ఉత్సాహ వంతులైన క్రీడాకారులు రూ.400 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. గెలుపొందిన జట్టుకు రూ.12 వేలు, రెండో బహుమతి రూ.10వేలు, మూడో బహుమతిగా రూ.5వేలు అందజేయనున్నామన్నారు. వివరాలకు సెల్ 62812 25267 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకోండి



స్టడీ మెటీరియల్‌ను విడుదల చేస్తున్న ఎంపీపీ

ఆళ్లగడ్డ: పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకు రావడం జరిగిందని చాగలమర్రి ఎంపీపీ వీరభద్రుడు అన్నారు. చాగలమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు యుటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను ఆయన ఆవిష్కరించి విద్యార్థులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ యూటీ ఎఫ్ ఆధ్వర్యంలో సుమారు 500 మంది విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేయడం అభినందనీయమన్నారు. యూటీఎఫ్ నాయకులు డెన్నీ జాన్సన్, బెన్నయ్య, శంకర్,విజయరాజు ఉన్నారు

16న కబడ్డీ పోటీలు

నంద్యాల(రూరల్): సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని ఈ నెల 16న నంద్యాల మండలం అయ్యలూరు గ్రామంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామ చెన్నకేశవ స్వామి ఆలయ అభ్యుదయ యువజన కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. పోటీల్లో విజేత జట్టుకు నంద్యాల మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు బసవేశ్వరరెడ్డి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి గ్రామానికి చెందిన సంజీవరాయుడు రూ.20 వేలు, తృతీయ బహుమతి గ్రామ సర్పంచ్ బాల ఓబులేసు రూ.10 వేలు అందజేస్తారన్నారు. అలాగే గార్దబాల పోటీలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన జట్టు సభ్యులు 9573944546, 9441 808626 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

త్యాగరాజ స్వామి గ్రామోత్సవం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బాల్కొండ హాల్‌లో వెలసిన శ్రీ త్యాగరాజ స్వామి దేవస్థానంలో స్వామి వారి 256వ జయంతి 176వ ఆరాధన పురస్కరించుకొని మంగళవారం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. త్యాగరాజ స్వామి ఉత్సవ మూర్తి స్వర్ణ విగ్రహంతో పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం టీటీడీ ఆస్థాన విద్వాంసులచే కచేరి నిర్వహించారు. నిర్వాహకులు రామాయణం శివ రామకృష్ణ, శ్రీనివాసులు, సురేష్‌బాబు, మణికంఠ, బాలకొండారెడ్డి, సుధాకర్‌బాబు, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

గోస్పాడు: సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఈఓఆర్‌డీ నాగేంద్రుడు సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లో పనిచేసే సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని చెప్పారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు సేవలు సత్వరం అందేలా చూడాలన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అలాగే గ్రామాల నుంచి వచ్చే వినతులను కూడా ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించాలని, ఏవైనా ఇబ్బందులుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చొరవ చూపాలన్నారు.

అష్టాదళ పాద పద్మారాధన సేవ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీ కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మరసంచే ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి చీర, ఒడి బియ్యం సమర్పించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్రాచారి, సుబ్బాచారి, అరవేటి వాసు, విజయకుమార్, నరసింహ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస పూజలు

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలంలో ధనుర్మాస పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఉత్సవమూర్తులు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరద స్వాములతోపాటు శ్రీ గోదాదేవి అమ్మవారిని యాగశాలలో కొలువుంచి వేదమంత్రోచ్చారణలతో, మంగళవాయిద్యాల నడుమ నవకలశ స్థాపన, పంచామృతాభిషేకం, తిరుమంజనం, అర్చన కనుల పండువగా నిర్వహించారు. నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

ఘనంగా శిల్పా పుట్టిన రోజు వేడుకలు



మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నంద్యాల: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి శిల్పామోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. శిల్పా గృహంలో ఆయనచే భారీ కేక్ కట్ చేయించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు పూలమాలలు వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని టెక్కె మార్కెట్ యార్డులో రక్తదానం నిర్వహించారు. శిల్పాసేవా సమితి చైర్‌పర్సన్ నాగిని రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దాల్‌మిల్ అమీర్‌బాషా, చల్లా మధుతో పాటు 30 మంది రక్తదానం చేశారు. మాజీ కౌన్సిలర్ అమృతరాజ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. శిల్పామోహన్‌రెడ్డి మాట్లాడుతూ తమ కుటుంబంపై నంద్యాల నియోజకవర్గ ప్రజలు చూపిస్తున్న ప్రేమ, అభిమానాన్ని ఎప్పటికీ మరువలేమన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, నమ్మకున్న వారికి శిల్పా కుటుంబం ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

మున్సిపల్ స్థలాల పరిరక్షణకు చర్యలు



నంద్యాల 1వ వార్డు ప్రజలతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

నంద్యాల(సిటీ): పట్టణంలోని మున్సిపల్ స్థలాలను పరిరక్షిస్తామని కమిషనర్ రవిచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక 1వ వార్డులో కబ్జాకు గురైన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మున్సిపల్ ఆస్తులను, స్థలాలను పరిరక్షించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఎవరైనా స్థలాలను ఆక్రమించినా, అక్రమ నిర్మాణాలు చేపట్టినా మున్సిపాలిటీల చట్టం-1965 ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. 1వ వార్డులో కొందరు మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించినట్లు తమ దృష్టికి వచ్చిందని, వెంటనే స్థలం నుంచి ఖాళీ చేయించామన్నారు. మున్సిపల్ డీఈ మధుకుమార్, టౌన్ ప్లానింగ్ అధికారిణి రాణెమ్మ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి, టీపీబీఓ రిజ్వాన, మున్సిపల్, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి

ఆళ్లగడ్డ: మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పించేవారిని ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకర్ రెడ్డి హెచ్చరించారు. చాగలమర్రి పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే ఉపేక్షించేది ఉండదన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు దృష్టికి వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. చిన్న విషయాలకు ఘర్షణ పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఎస్‌ఐ సత్యనారాయణ ఉన్నారు.

కొత్తూరు వృషభాలు భళా



విజేత వృషభాల యజమానికి బహుమతి అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా ఎమ్మిగనూరు రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నాలుగు పళ్ల ఒంగోలు ఎద్దుల బండలాగుడు పోటీల్లో నంద్యాల జిల్లా కొత్తూరు వృషభాలు విజేతగా నిలిచాయి. మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వృషభాల యజమానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి రూ.30 వేల నగదు బహుమతిని అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా రాయపురం వృషభాల యజమాని నల్లారెడ్డికి రూ.25వేలు, మూడోస్థానం దక్కించుకున్న బ్రాహ్మణ పల్లె వృషభాల యజమాని కొప్పెర్ల జయమ్మకు రూ.15వేలు అందజేశారు. కార్యక్రమంలో పోటీల నిర్వాహకులు, వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, ఎంపీపీ కేశన్న, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, సోగనూరు భీమిరెడ్డి, కుమారస్వామి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్దశి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద వెలసిన శ్రీలక్ష్మీ గణపతి దేవస్థానంలో మంగళవారం సంకటహర చతుర్దశి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు మాడుగుల నాగఫణి శర్మ ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించి గరికతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహాగణపతి వ్రతం, హోమం నిర్వహించి పూర్ణాహుతి గావించారు. ఆలయ నిర్వాహకులు తిరువీధి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు కల్పించాలి

నంద్యాల(వ్యవసాయం): ముస్లిం జనాభా 30 శాతం కన్నా అధికంగా ఉన్న నియోజకవర్గాల్లో రాజకీయంగా రిజర్వేషన్లు కల్పించేలా అన్ని రాజకీయ పార్టీలు కృషి చేయాలని బీజేపీ మైనార్టీ మోర్చ రాష్ట్ర నాయకుడు సయ్యద్ ముక్తార్‌బాషా డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తమ హక్కుల సమస్యలపై గళమెత్తడానికి జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం ఉండేలా అన్ని పార్టీలు చొరవ తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఇళ్ల నిర్మాణాల్లో నిర్లక్ష్యం వీడాలి

- జిల్లాలో ఉగాది నాటికి 10,004 ఇళ్లు పూర్తి కావాల్సిందే
- జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాల్లో నిర్లక్ష్యం వీడి సచివాలయాల వారీగా కేటాయించిన లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. బుధవారం జాయింట్ కలెక్టర్ టి.నిశాంతితో కలిసి కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రగతి తక్కువగా ఉన్న సచివాలయాల వారీగా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాలపై కేటాయించిన లక్ష్యాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉగాది నాటికి 10,004 ఇళ్లు పూర్తి చేయాలన్న లక్ష్యంలో భాగంగా ఇప్పటివరకు 159 గృహాలు మాత్రమే పూర్తయ్యాయని, మిగతా గృహాలను పూర్తి చేసేందుకు నియోజకవర్గ స్పెషల్ అధికారులు, హౌసింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వారాంతపు లక్ష్య ప్రగతిలో 78 సచివాలయాలు వెనుకబడి ఉన్నాయని, అందుకు కారణాలపై సంబంధిత అధికారులను ప్రశ్నించారు. ప్రతి మండలంలో మూడు సచివాలయాలు గృహ నిర్మాణాల ప్రగతి లక్ష్యాన్ని సాధించలేకపోయాయన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఇళ్ల నిర్మాణ దశలను జియో ట్యాగింగ్ చేసి, ఎం.బుక్ రాసి బిల్లులను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రణాళిక లేకుండా ఎలా ప్రగతి చూపిస్తారని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ప్రశ్నించారు. ప్రతి ఒక్కరూ వచ్చే వారానికి ప్రగతి చూపిస్తామని చెప్పడంపై ఈ వారం ఏం పని చేశారని, సచివాలయాలకు టార్గెట్ తక్కువగా ఉన్నా పూర్తి చేయలేకపోవడానికి గల కారణాలను ప్రశ్నించారు. రూఫ్ లెవెల్, రూఫ్ కాస్ట్ స్థాయిలో ఉన్న గృహాలను కూడా పూర్తి చేయలేకపోతున్నారని, ప్రత్యేక ఫోకస్ పెట్టి పూర్తి చేయించాలన్నారు. హౌసింగ్ ఈఈ మాధవరావు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, లేఅవుట్ స్పెషల్ ఆఫీసర్లు, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లు, విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్, హౌసింగ్ డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

రుణాల మంజూరు



చెక్కు అందజేస్తున్న దృశ్యం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని పేద మహిళలకు అండగా శిల్పా మహిళా బ్యాంకు చేయూతనందిస్తోందని చైర్‌పర్సన్ నాగిని రవిసింగారెడ్డి తెలిపారు. మహిళా బ్యాంకు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక టెక్కె మార్కెట్ యార్డులో మహిళలకు రుణాలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా 144 మంది మహిళలకు రూ.17 లక్షల చెక్కును ఆమె అందజేశారు. బ్యాంకు డైరెక్టర్ పూర్ణిమ, మేనేజర్ హరిలీలా, సిబ్బంది లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

దొర్నిపాడు: మండలకేంద్రానికి చెందిన గురుమూర్తి ఆచారి రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వైఎస్సార్ బీమాకు నమోదై ఉండడంతో మంగళవారం తక్షణ సాయంగా రూ.10 వేలను మృతుడి కుమారుడు భద్రకు ఎంపీడీఓ నాగఅనసూయ అందజేశారు.

తలనీలాల వేలంలో రూ.5.77 లక్షల ఆదాయం

సిద్ధవటం: వైఎస్సార్‌జిల్లా సిద్ధవటం మండలం వంతాటిపల్లె సమీపంలో వెలసిన శ్రీ నిత్యపూజ స్వామికి భక్తులు సమర్పించుకునే తలనీలాలు పోగుచేసుకునే హక్కుల కోసం నిర్వహించిన వేలంలో చాగలమర్రి మండలం గొడుగునూరుకు చెందిన కోటపాటి వెంకట నరసమ్మ అనే మహిళ రూ.5,77,000 లకు దక్కించుకున్నారు. ఈ విషయాన్ని ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. సిద్ధవటంలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో మంగళవారం వేలం పాట నిర్వహించారు. వైఎస్సార్ జిల్లా మైదుకూరు, ప్రొద్దుటూరు, నంద్యాల జిల్లా చాగలమర్రి, నంద్యాల, ఏలూరు, వంతాటిపల్లె, జ్యోతి ప్రాంతాలకు చెందిన 11 మంది పోటీపడ్డారు. చాగలమర్రి మండలం గొడుగునూరుకు చెందిన కోటపాటి వెంకట నరసమ్మ రూ.5,77,000 లకు హెచ్చు పాడి తలనీలాలు పోగుచేసుకునే హక్కులను దక్కించుకున్నారు. వేలం పాటలో గతేడాది కంటే రూ.27,000 అదనంగా ఆదాయం వచ్చిందన్నారు. రాజంపేట దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఆలయ చైర్మన్ పాటూరు కొండారెడ్డి, శివారెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(అర్బన్): అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులు పెంచి అంగన్‌వాడీలను బలోపేతం చేయాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించి ఎన్నికల డీటీ రామనాథరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. **దొర్నిపాడు:** అంగన్‌వాడీ వర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలని మండల అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం తహసీల్దార్ జయప్రసాద్, ఎంపీడీఓ నాగ అనసూయలకు వినతి పత్రం అందజేశారు.

ముగ్గుల పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం



ముగ్గులను పరిశీలిస్తున్న నాగిని రెడ్డి

బొమ్మలసత్రం: సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక టెక్కె మార్కెట్ యార్డులో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు శిల్పా మహిళా బ్యాంకు చైర్‌పర్సన్ నాగిని రవిసింగారెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో దాదాపు 200 మంది ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.15 వేలు, రెండవ బహుమతి రూ.10 వేలు, మూడవ బహుమతి రూ.5 వేలు అందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి సత్కారం



చౌడేశ్వరిని సత్కరిస్తున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణ

నంద్యాల(వ్యవసాయం): ఇటీవల విశాఖపట్నంలో శని, ఆదివారాల్లో జరిగిన జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ బెంచ్ ప్రెస్ పోటీల్లో పట్టణానికి చెందిన చౌడేశ్వరి 43 కేజీల విభాగంలో బంగారు పతకం, డెడ్ లిఫ్ట్ కేటగిరిలో బంగారు పతకం, బెంచ్ ప్రెస్‌లో రజత పతకం సాధించింది. ఈ సందర్భంగా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సోమశేఖరప్ప అధ్యక్షతన చౌడేశ్వరికి అభినందన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ చౌడేశ్వరి స్థానిక కాళికాంబ దేవాలయంలో హనుమాన్ వ్యాయామ శాలలో చెన్నంశెట్టి పుల్లయ్య, ఆనంద్ శిక్షణలో నిరంతర సాధన చేసి జాతీయ స్థాయిలో ఏపీ తరపున పతకాలు సాధించడం నంద్యాలకే గర్వకారణమన్నారు. ఎలుకూరు సుగుణకుమార్, గోళ్ల సుదర్శనం శెట్టి, తదితరులు పాల్గొన్నారు.